క్లుప్తంగా

ఆర్‌డీ పరేడ్‌కు నేహాశ్రీ



విద్యార్థి నేహాశ్రీని అభినందిస్తున్న అధ్యాపకులు

మణికొండ: గండిపేటలోని ఎంజీఐటీ విద్యార్థిని నేహాశ్రీ ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే (ఆర్‌డీ) పరేడ్‌కు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్ డా. చంద్రమోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఓడీ డా. ఎస్పీసింగ్, అధ్యాపకుడు డా. రవిచందర్, ఎస్ఎస్ఎస్ అధికారి డా. బాల్‌రెడ్డి అభినందించారు.

'బీఆర్‌ఎస్ పోరాటం ఫలించింది'

శంషాబాద్: బీఆర్‌ఎస్ పోరాటాల ఫలితంగానే లగచర్ల రైతులకు న్యాయం దక్కిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత మంచర్ల శ్రీనివాస్ అన్నారు. లగచర్ల రైతులు, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రైతులపై రాష్ట్ర సర్కారు చేస్తున్న దమనకాండను అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. అంతిమ విజయం న్యాయం వైపే ఉంటుందన్నారు.

వ్యక్తి అదృశ్యం



నర్సింహులు(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వెంకటేశ్వర కాలనీకి చెందిన నర్సింహులు(53) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 16వ తేదీన ఉదయం మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చీకటిపడ్డా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల, స్నేహితుల వద్ద ఆరా తీసినా అతడి ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు కుష్బూ స్కాలర్‌షిప్

గచ్చిబౌలి: సైబేజ్ ఐటీ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు బుధవారం స్కాలర్‌షిప్‌లు అందజేసింది. గచ్చిబౌలి పరిధి డీఎల్ఎఫ్‌లోని సైబేజ్ ఐటీ కంపెనీ కుష్బూ స్కాలర్‌షిప్ ద్వారా కండ్లకోయలోని సీఎంఆర్, మేడ్చల్ జిల్లాలోని ఎంఎల్ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన 19 మంది బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు రూ.30.30 లక్షల కాలేజీ, హాస్టల్ ఫీజును అందించింది. ఈ సందర్భంగా కంపెనీ అధికారి సురేష్ మామునురు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. బీటెక్ పూర్తయ్యే వరకు ఫీజులు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఆర్ కాలేజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎల్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ట్రైనింగ్‌హెడ్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

గోల్కొండ: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని మున్సిపల్ యూనియన్ డేట్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి సి.మల్లేష్ డిమాండ్ చేశారు. గుడిమల్కాపూర్ వార్డు కార్యాలయం ముందు కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. అలాగే వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్, వెంకటేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, నాయకురాలు నరసమ్మ, మంగమ్మ, అనుజా తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి జి.జయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 30 ఏళ్ల లోపు నిరుద్యోగులు అర్హులన్నారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా మేజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇక్కడ రెండు నెలల పాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణను ఇచ్చి ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ఉదయం 10.30 గంటలకు ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో విజయనగర్‌కాలనీలోని రంగారెడ్డి జిల్లా ఉపాధికల్పనా కార్యాలయంలో నేరుగా హాజరుకావాలన్నారు. వివరాలకు 90630 99306లో సంప్రదించవచ్చు.

కేవలం 'చెత్త'కే బడ్జెట్!

నేడు మణికొండ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- చెత్త నిర్వహణకే అధిక నిధులిచ్చే యోచనలో అధికారులు
- అభివృద్ధి పనుల నిధుల కేటాయింపునకు మొండిచేయి
- చివరి సమావేశంలో అధికారులను నిలదీసేందుకు సిద్ధమైన కౌన్సిలర్లు



మణికొండ మున్సిపల్ కార్యాలయం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పాలక కమిటీ గడువు జనవరి 20వ తేదీతో ముగియనుంది. మరో నెల రోజుల సమయం మాత్రమే ఉంది. దీంతో పలు వార్డులలో మిగిలిపోయి పనులకు చివరి సమావేశంలో ఎలాగైనా నిధులు రాబట్టాలని కౌన్సిలర్లు భావిస్తున్నారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు పెండింగ్ పనుల వివరాలతో కూడిన లేఖలను కమిషనర్‌కు రాశారు. బుధవారం కౌన్సిలర్లు చివరి సమావేశ అజెండా పత్రాలను అందుకున్నారు. కౌన్సిలర్లు అడిగిన ఒక్క పనికి నిధులను కేటాయించే ఉద్దేశం అందులో కనిపించకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే తమ వార్డులో పనులు పూర్తయ్యేదెన్నడు.? ప్రజలకు ఏమని సమాధానం చెప్పాలి? అని పలువురు కౌన్సిలర్లు ఆందోళన చెందుతున్నారు.

◆ **నిలిచిన పనులకు మొండిచేయి..**

నూతన మున్సిపల్ కార్యాలయ భవనం, పార్కులు, క్రీడా ప్రాంగణాలు, పలు కమ్యూనిటీహాళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయి ఉన్నాయి. వాటిని పూర్తి చేయాలంటే సుమారు రూ.20కోట్ల వరకు నిధులు అవసరమవుతాయి. కానీ చివరి సమావేశ అజెండా పత్రంలో దాని ఊసే ఎత్తకపోవడంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం వట్టినాగులపల్లి డంపింగ్ యార్డు నుంచి జవహర్‌నగర్ డంపింగ్ కేంద్రానికి చెత్త తరలింపు, జలమండలి నీటి సరఫరాకు మాత్రమే నిధులు కేటాయించి మమ అనిపించేందుకు పాలకులు సిద్ధమయ్యారు. దీంతో అధికారులను నిలదీసేందుకు కౌన్సిలర్లు సిద్ధమవుతున్నారు.

◆ **చెత్త తరలింపునకే అధిక నిధులు...**

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను వట్టినాగులపల్లిలోని డంపింగ్ యార్డుకు చేరుస్తారు. అక్కడ వర్మి కంపోస్టు ఎరువు, పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి మిగిలిన చెత్తను జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. అందుకుగాను సంవత్సరానికి రూ. 18.50 కోట్లు చెల్లిస్తున్నారు. దానిని ఇప్పటి వరకు పెండింగ్‌లో పెట్టి చివరి సమావేశం అజెండాలో చేర్చి చెల్లింపులు చేసేందుకు సిద్ధమవడం ఏమిటని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లులను మూడు నెలలకోసారి చెల్లించకుండా ఒకేసారి చెల్లించే ప్రయత్నం చేయడం ఏమిటని వారు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

◆ వట్టినాగులపల్లి డంపింగ్ కేంద్రంలో చెత్త, ప్లాస్టిక్ వేరు చేసే మెషిన్ నిర్వహణకు రూ.1.31 కోట్లను కేటాయించాలని అజెండాలో పెట్టారు. కేవలం చెత్త నిర్వహణకే రూ.19.81 కోట్లు కేటాయించాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. అదే విధంగా తాగునీటి సరఫరా నిర్వహణకు రూ.2.25కోట్లను కేటాయించనున్నారు. నెక్నాంపూర్ చెరువు, ట్రాఫిక్ సమస్య, సృజనాత్మక పద్ధతిలో చెత్త సేకరణ చేపట్టేందుకు ఇక్సిసిటీస్ సంస్థకు పీపీపీ పద్ధతిలో అప్పగించే విషయాన్ని కౌన్సిల్ అజెండాలో చేర్చారు. వీటన్నింటిపై గురువారం కౌన్సిల్ సమావేశం ఎలా జరుగుతుందో వేచి చూద్దాం.

ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తాం



మార్కెట్ యార్డ్ ఆవరణలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ ఉషారాణి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీలోని 17వ వార్డు మార్కెట్ యార్డ్ ఆవరణలో హైమాస్ట్ లైట్లు లేకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గమనించిన స్థానిక కౌన్సిలర్ ఉషారాణి మున్సిపాలిటీ నుంచి నిధులను కేటాయించారు. హైమాస్ట్ లైట్ల పనులు పూర్తి కావటంతో బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ... ప్రజలకు కావాల్సిన అన్ని వసతులను కల్పిస్తామన్నారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫరూఖ్, లైన్‌మెన్ శ్రీకాంత్, లోకేష్, కనకరాజు, వార్డు మహిళలు పాల్గొన్నారు.

సొంత నిధులతో అంగన్‌వాడీ అభివృద్ధి



అంగన్‌వాడీ కేంద్రం వద్ద కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి

మణికొండ: ఖానాపూర్ 12వ వార్డులో పేదల పిల్లలు చదువుకునే అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. ఈ విషయంలో తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ అమరేందర్ రెడ్డి దానికి మరమ్మతులు చేయించారు. అనంతరం రంగులు వేయించి దానిని అందంగా తీర్చిదిద్దారు. సొంత డబ్బుతో అంగన్‌వాడీ కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దిన కౌన్సిలర్‌కు టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నార్సింగి మున్సిపాలిటీ వార్డుల అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధికి కృషి చేస్తున్నామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆమె మంచిరేవుల ఎస్సీకాలనీలో రూ.30లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అన్ని వార్డులలో అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు డి.లక్ష్మణ్, జీడీ క్రాంతి, పి.శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంక్ ప్రారంభం...

మంచిరేవుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన నీటి ట్యాంక్‌ను చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాపిరెడ్డి, ఉపాధ్యాయులు భసవేశ్వరమ్మ, శారద, కృష్ణవేణి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

సైబర్ సెక్యూరిటీ డీసీపీ శ్రీబాల



ఎంజీఐటీలో మాట్లాడుతున్న డీసీపీ శ్రీబాల

మణికొండ: మన రాష్ట్రంలో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వాటితో అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారని సైబర్ సెక్యూరిటీ డీసీపీ శ్రీబాల అన్నారు. బుధవారం గండిపేటలోని ఎంజీఐటీ, సీబీఐటీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ మోసం, ఫిషింగ్, సోషల్ ఇంజినీరింగ్ దాడులు, ఆర్థిక మోసాలను గుర్తించటం, నివారించటంపై మాట్లాడారు. అలాంటి వాటికి గురైన వారు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే పోలీసులు ఆర్థిక నష్టాలను రాబట్టి బాధితులకు అందజేస్తారని తెలిపారు. పార్ట్‌టైం ఉద్యోగాలని, ఆఫర్‌లని, బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని అనేక రకాలుగా నేరగాళ్లు ప్రజలను తప్పుదోవ పట్టించి ఆర్థిక నేరాలను పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటి వాటికి ప్రజలు మోసపోవద్దన్నారు. ఎవరూ దేనిని ఉచితంగా ఇవ్వరనే విషయాన్ని గమనించాలన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ప్రొఫెసర్లు బి.లింగారెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్, రాధాకృష్ణప్రసాద్‌లతో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.



సీబీఐటీలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

వ్యాధుల నియంత్రణకు పరిశోధనలు జరగాలి

పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ. శరతచంద్రా



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డు ప్రదానం చేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: పరాన్నజీవుల ద్వారా జంతువులకు వాటి నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులను నియంత్రించడానికి ఆధునిక పరిశోధనలు జరుగాలని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాయలం రిజిస్ట్రార్ ప్రొ. శరతచంద్రా అన్నారు. పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో పరాన్నజీవ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 33వ నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ వెటర్నరీ సింపోజియంలో భాగంగా బుధవారం వివిధ శాస్త్రీయ సమావేశాలు నిర్వహించారు. అడవి జంతువు లు, పౌల్ట్రీ కోళ్ల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులపై ప్రభావం చూపే పరన్నాజీవుల నియంత్రణ, చికిత్సలపై శాస్త్రీయ సదస్సులు నిర్వహించాలన్నారు. కొత్త చికిత్సలు, బయోలాజికల్ నియంత్రణ, విధానాలపై నిర్వహించిన బయోలాజికల్ నియంత్రణ, రసాయనిక మందులకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చెందుతున్న కొత్త చికత్స విధానాలపై చర్చలు చేశారు. ఉత్తమ ఆవిష్కరణలు, పరిశోధనలు చేసిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఉత్తమ జేబీ దుబే, ఐఏఏవీపీ యంగ్ సైంటిస్ట్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాయలం అధికారులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


శబరిమలకు బైలెల్లిన స్వాములు

అత్తాపూర్: అయ్యప్పస్వామి నామస్మరణతో హైదర్‌గూడ ప్రాంతం మార్మోగింది. హైదర్‌గూడలో మండల దీక్షను పూర్తి చేసుకున్న స్వాములు బుధవారం శబరిమలకు బైలెల్లారు. మల్కిదాస్ హనుమాన్ దేవాలయంలో బుధవారం ఉదయం ఇరుముడులు కట్టుకొని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, వరద రాజురెడ్డి, పెంటల సుధాకర్‌రెడ్డి, జైరాజ్‌రెడ్డి, దేవేందర్ స్వాములు శబరిమలై యాత్రకు బయల్దేరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మోహెంద్ర కొమురయ్య, నందకిషోర్, మ్యాడం మధు, జయానంద్‌రెడ్డి, సనివెల్లి కృష్ణ, శివ, శ్రీశైలం, దేవేందర్, రావుల జగన్, ఐలయ్య, ఆనంద్, రవీందర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, బీట్కూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



'ప్రభుత్వం వికృత చేష్టలకు పాల్పడుతోంది'

అత్తాపూర్: లగచర్ల ఘటనలో పట్నం నరేందర్‌రెడ్డితో పాటు 24 మందికి నాంపల్లి స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు చేయడం ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తోందని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నేత అప్పారెడ్డి ముఖేష్ అన్నారు. లగచర్లలో భూములు కోల్పోతున్న రైతు కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచిందన్నారు. దేశ రాజధాని న్యూ ఢిల్లీతో పాటు రాష్ట్రంలో వివిధ రూపాల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య విలువలకు ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు. అమాయక రైతులను చిత్రవధలకు గురిచేసి గుండెపోటు వచ్చిన రైతులను సైతం బేడీలు వేసి జైలులో బంధించడం విచారకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికృత చేష్టలను పాల్పడుతోందని అన్నారు.



ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



లక్ష్మీగూడలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలను తొలగిస్తున్న సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించి రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ రవికుమార్ కూల్చివేయించారు. బుధవారం లక్ష్మీగూడ నుంచి వాంబేకాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించారు. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులతో కలిసి ఈ కూల్చివేతలను చేపట్టారు. భారీ బందోబస్తు నడుమ ఫుట్‌పాత్ ఆక్రమణలను నెలమట్టం చేశారు. దీంతో స్థానికులు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కూల్చివేతలకు అడ్డుగా వస్తున్న వారిని పోలీసులు నియంత్రించి యథావిధిగా కూల్చివేతలను కొనసాగించారు.

◆ ఈ సందర్భంగా సర్కిల్ డీసీ రవికుమార్ మాట్లాడుతూ... లక్ష్మీగూడ నుంచి వాంబేకాలనీకి వెళ్లే రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయని అన్నారు. దీంతో వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఫుట్‌పాత్ ఆక్రమణలను నెలమట్టం చేశామన్నారు. మరోసారి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ **కూల్చివేతలకు సమయం ఇవ్వాలి: ఎమ్మెల్యే**

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడలో జరుగుతున్న ఫుట్‌పాత్‌ల తొలగింపు విషయాన్ని తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు, అధికారులతో ఆయన మాట్లాడారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు కోసం సమయం ఇవ్వాలన్నారు. ఇప్పటికప్పుడు తొలగిస్తామంటే వారు ఇబ్బందులు పడతారని వారికి తగిన సమయం ఇస్తే సామాన్లు తొలగించుకుంటారన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ సెలబ్రేషన్స్



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్

మణికొండ: చిత్రపురి కాలనీలో బుధవారం రాత్రి కౌన్సిలర్ హైమాంజలి ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. పండగలను ప్రతి ఒక్కరూ సంతోషంగా కుటుంబ సమేతంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాల్‌రెడ్డి, కుమార్, లక్ష్మీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకోవాలి

మణికొండ: క్రిస్మస్ పండగను క్రైస్తవులు ఘనంగా జరుపుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం సెక్రటేరియేట్ కాలనీలో జరిగిన ప్రీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230